క్లుప్తంగా

వైభవంగా జగన్నాథుని మంగళస్నానం



స్వామి వారికి మంగళస్నానం చేయిస్తున్న ఆలయ అర్చకులు

సీటీఆర్ఐ: జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఇస్కాన్‌లోని జగన్నాథ స్వామికి ఆదివారం ఘనంగా మంగళస్నానం చేయించారు. భక్తులు దర్శించుకునేందుకు వీలుగా స్వామివారి విగ్రహాలను గోదావరి గట్టు వద్దకు తీసుకుని వచ్చి ఉంచారు. అనంతరం స్వామి వారిని రథంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్ పూజారి శ్యామంగా శ్రీనివాస్ ప్రభు, ఇస్కాన్ రాజమహేంద్రవరం శాఖ అర్చకులు శివానంద నిమయిదాస్, హేమనిమయి దాస్‌లు పాల్గొన్నారు.

అనకాపల్లి వెళ్లి.. పింఛను అందించి..



నూకాలమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ గోవిందు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ సచివాలయం-4 పరిధిలో లబ్ధిదారు పోలవరపు నూకాలమ్మ అనారోగ్యంతో అనకాపల్లిలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. ఆమెకు వలంటీర్ తిర్రు గోవిందు అనకాపల్లి వెళ్లి పింఛను అందించారు. కష్టాల్లో ఉన్న తనకు పింఛను అందించడంతో ఆనందానికి అవధుల్లేవు.

ఆర్థిక సాయం



జాన్ కుటుంబానికి బాండు అందజేస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్, చిత్రంలో మిత్రబృందం

కడియం: ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు రూ.75వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కడియం గ్రామానికి చెందిన సాకుర్తి జాన్ గతేడాది విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. అతడికి భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. వారికి చేయూతగా కడియం హైస్కూల్‌లో 2004-05 పదో తరగతి చదువుకున్న జాన్ మిత్రబృందం ముందుకు వచ్చి, నగదును సేకరించి జాన్ కుమార్తె పేరిట పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ బాండ్‌ను ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ చేతుల మీదుగా అతడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులను సత్యప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, తామెళ్ల అయ్యప్ప, చిక్కాల శ్రీను, తోట మణికంఠ, మర్రి కాశీ, చక్రపాణి, గంధం వినయ్ పాల్గొన్నారు.

14 నుంచి వారాహి యాత్ర

సీటీఆర్ఐ: ఈ నెల 14వ తేదీ నుంచి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వారాహి యాత్ర అన్నవరం, రాజోలు, సఖినేటిపల్లి మీదుగా పశ్చిమ గోదావరికి సాగనుందని జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తెలిపారు. ఆదివారం ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తూర్పు సెంటిమెంట్‌తో ఈ యాత్ర పది రోజుల పాటు సాగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ రెండు రోజులు వారాహి యాత్ర, బహిరంగ సభల్లో పాల్గొంటారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



వ్యక్తి మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ: సుమారు 60 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి గోదావరి రైల్వే స్టేషన్‌కు అన్నపూర్ణంపేట గేటుకు మధ్యలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని జీఆర్పీ ఎస్సై మావుళ్లు తెలిపారు. మృతుని శరీరంపై నీలం రంగు లుంగీ, తెలుపు రంగు చొక్కా, నీలంరంగు మీద తెలుపు గడులు ఉన్న టవల్ ధరించి ఉన్నాడన్నారు. మరే విధమైన ఆధారాలు లభ్యం కాలేదని, కుడి కాలు మీద బొల్లి మచ్చ గుర్తించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు రాజమహేంద్రవరం జీఆర్పీ స్టేషన్‌లోని 0883 2442821, 9491003239, 9440627551నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆదర్శ స్ఫూర్తి

- దివ్యాంగులు, వృద్ధులకు నిత్యాన్నదానం
- రెండేళ్లుగా స్ఫూర్తి ట్రస్ట్ ద్వారా సహాయం
- ఆదర్శంగా నిలుస్తున్న పోసికుమార్ దంపతులు



ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో వృద్ధులు,దివ్యాంగులకు ఆహార పొట్లాలను అందజేస్తున్న ముత్యాల పోసికుమార్ దంపతులు

ధవళేశ్వరం: తాము కష్టపడినా పది మందికి కడుపు నింపాలన్న వారి ఆలోచన పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ప్రమాదంలో అంగవైకల్యం కలిగినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతూ దివ్యాంగులకు అండగా ఉంటున్నారు. దివ్యాంగుల తరఫున హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారు. తమ చుట్టూ ఉన్న వృద్ధులు, దివ్యాంగులు ఆకలితో అల్లాడిపోతుంటే వారికి పట్టెడన్నం పెట్టి మేమున్నామంటూ ముందుకు వచ్చారు. వారే ధవళేశ్వరం గ్రామానికి చెందిన ముత్యాల పోసికుమార్ తన భార్య సత్య. వారు రెండేళ్లుగా స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం చేస్తున్నారు. దివ్యాంగులు, వృద్ధులకు రోజూ ఆహార పొట్లాలను అందిస్తూ వారి ఆకలి తీరుస్తున్నారు. ఎంతో మంది అభాగ్యులకు అన్నం పెడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ముత్యాల పోసికుమార్ దంపతులు.

మూడేళ్ల కిందట స్ఫూర్తి ఆవిర్భావం

దివ్యాంగులు, వృద్ధులకు సేవలందించాలన్న ప్రధాన లక్ష్యంతో ముత్యాల పోసికుమార్ ధవళేశ్వరంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించారు. కరోనా సమయంలో ట్రస్ట్ తరఫున అనేక సేవలు అందించారు. ఈ సమయంలో చాలా మంది తినడానికి లేక ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించారు. కష్ట సాధ్యం అయినప్పటికీ దాతల సాయంతో గత రెండేళ్లుగా నిరాటంకంగా నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రోజుకు సుమారు వంది మందికి అన్నం పెడుతున్నారు.

దాతలకు వేదికగా...

మానవసేవే మాధవ సేవ అన్న రీతిలో పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం ద్వారా అందిస్తున్న సేవలకు ఆకర్షితులవుతున్నారు. తమ పుట్టినరోజు, పెళ్లి రోజు సమయంలో దివ్యాంగులు, వృద్ధులకు వస్త్రదానం, అన్నదానం చేస్తున్నారు.

జన్మకు సార్థకత



దివ్యాంగులు, వృద్ధులకు ప్రతి రోజూ తమ ట్రస్ట్ తరఫున ఆకలి తీర్చడం ద్వారా నా జన్మ సార్థకమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదలకు, అభాగ్యులకు అందిస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నాం. ట్రస్ట్ నిర్వహణ భారమైనప్పటికీ ఆకలి తీర్చడంలో కలిగిన తృప్తి వాటి అన్నింటినీ మర్చిపోయేలా చేస్తోంది. ట్రస్ట్ ద్వారా దివ్యాంగులు, వృద్ధులకు మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతాం. తాము చేసే సేవ దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నాం.

– ముత్యాల పోసికుమార్, స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

ఆకలి తీరుస్తున్నారు



నా అన్న వాళ్లు ఎవరూ లేదు. ప్రతి రోజూ అన్నం అందించి ఆకలి తీరుస్తున్నారు. రెండేళ్లుగా నాకు అన్నం పెడుతున్నారు. ఆయన చల్లగ ఉండాలి. ఆకలి కోసం అలమటించే నా లాంటి ఎందరికో అన్నదానం చేస్తున్నారు.

– రాఘవ

అండగా ఉంటూ..



స్ఫూర్తి ట్రస్టు ద్వారా మాలాంటి అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. ప్రతి రోజూ ఆహారాన్ని అందించి ఆకలి తీరుస్తున్నారు. మరింత మందికి సేవలు అందే విధంగా ట్రస్టు అభివృద్ధి చెందాలి.

– లక్ష్మణరావు

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న పంచాయతీరాజ్ ఆఫీసర్ ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ: ప్రకృతిలో ఎలాంటి కాలుష్యం లేకుండా రక్షించుకుంటేనే భూమిపై అన్ని ప్రాణుల మనుగడ సాగుతుందని పంచాయతీరాజ్ ఆఫీసర్ ఏబీవీ ప్రసాద్ అన్నారు. ఆదివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ ఆఫీసర్ ప్రసాద్, డాక్టర్ మహాలక్ష్మి కుమార్, డాక్టర్ హిప్నో పద్మా, అచ్యుతా రామిరెడ్డి, పి.రమేష్ కుమార్, డివిజనల్ అధికారులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్, కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అందరూ మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని కోరారు. మొక్కలు పెంచుదాం ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు.

రుణాలు మంజూరు చేయాలి



సమావేశంలో పాల్గొన్న బొజ్జ రామకృష్ణ తదితరులు

సీటీఆర్ఐ: ఎలక్ట్రికల్ వర్కర్లకి టూల్ కిట్లు కోసం బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఆర్డీఓ చైత్రవర్షిణిని కలిసి వినతిపత్రం అందజేసినట్టు గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ తెలిపారు. ఆదివారం యూనియన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూల్ కిట్లు విషయంలో బ్యాంకు సిబ్బంది సంప్రదించామని, వారు సానుకూలంగా స్పందించారన్నారు. అనంతరం కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో అకాల మరణం పొందిన వారి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఆసప శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ వీరవల్లి గంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే వ్యాపారస్తుల పురోగతి



సమావేశంలో మాట్లాడుతున్న అయ్యాజీ వేమా

రాజమహేంద్రవరం సిటీ: వ్యాపారుల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఆయ్యాజీ వేమా పేర్కొన్నారు. ఆదివారం నగరంలో ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలన విజయాల ప్రచార కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు ఐరన్, హార్డ్ వేర్, పెయింటర్స్ అసోసియేషన్ హాల్‌లో వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ పరిపాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం, జీఎస్టీ అమలు తర్వాత దేశ పురోగతి, జీఎస్టీ చెల్లింపుల ద్వారా వ్యాపారస్తులకు బ్యాంక్ రుణాలు తేలికగా మంజూరు అవ్వడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐరన్ హార్డ్ వేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల శ్రీరాములు, ఛాంబర్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, వెత్సా వెంకటేశ్వరరావు, గంగుమళ్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలోకి చేరిన వారితో చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై బొమ్మూరు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేనకు చెందిన యువత ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ నాయకులు మత్స్యేటి శివ ఆధ్వర్యంలో చేరిన వారికి ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చందన నాగేశ్వర్, పార్టీలో చేరిన ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను యువత ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలుగొండల క్ష్మి, రమేష్ యాదవ్, సాయి నరేంద్ర, సందీప్, సతీశ్, నాగు, మూర్తి, రాజు, దుర్గ, సాయి, బన్ను, అమర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలసుబ్రహ్మణ్యం జయంతి



బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గాన గంధర్వుడు, పద్మభూషణ్, పద్మశ్రీ డాక్టర్ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం జయంతిని రాకా సాంస్కృతిక సంస్థ కార్యాలయం బాలు సాంస్కృతిక మందిరంలో డాక్టర్ కంటే వీరన్న చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ప్రముఖ సీనియర్ పాత్రికేయులు కృష్ణకుమార్, నూజిళ్ళ సూరిబాబు, ఓఎన్జీసీ పూర్వ జనరల్ మేనేజర్ విజయ కుమార్, సరస్వతి పీఠం వ్యవస్థాపకులు తోట సుబ్బారావు, గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జగన్నాథం, సభ్యుడు పి.శేషుకుమార్, కోశాధికారి సూరపరెడ్డి తాతారావు, రాకా కార్యదర్శి జీవీ రమణ, సహాయ కార్యదర్శి కేఎస్ గౌరీశంకర్, పలువురు కళాభిమానులు పాల్గొని ఎస్పీ బాలు వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ముందుగా బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డాక్టర్ వీరన్నచౌదరి, దేవకుమార్, సుబ్రహ్మణ్యం, మార్కండేయులు, సోమరాజనాయుడు, విజయకుమార్, జీవీ రమణ పలు పాటలు ఆలపించారు.

వినాయకుడికి విశేష పూజలు

రాజమహేంద్రవరం రూరల్: జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా కొంతమూరు ఆఫీషియల్ కాలనీలోని వరసిద్ధ వినాయక మందిర్‌లో ఆదివారం స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్య భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మెయిన్ రోడ్డు ఎలక్ట్రానిక్స్ షాపులో అగ్నిప్రమాదం

ఎంపీ భరత్ చొరవతో మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



మెయిన్‌రోడ్డులో ఎలక్ట్రానిక్ షాపు మంటల అదుపు చేస్తున్న సహాయక చర్యల్లో ఎంపీ భరత్‌రామ్



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలో ఆదివారం రాత్రి ఓ ఎలక్ట్రానిక్స్ షాపులో మంటలు చెలరేగాయి. సరిగ్గా అదే సమయానికి మెయిన్ రోడ్డును పరిశీలించడానికి వచ్చిన ఎంపీ భరత్ ఆ మంటలను చూసి వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు ఫోన్ చేసి క్షణాల్లో సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అంతే కాకుండా మంటలు పూర్తిగా తగ్గే వరకూ అక్కడే ఉండి సహాయక చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే... ఆదివారం రాత్రి 9.40 గంటల ప్రాంతంలో మెయిన్ రోడ్డు వన్ టౌన్ పోలీసు స్టేషను ఎదురుగా ఏ టూ జెడ్ షాపు పైన గల మహావీర్ ఎలక్ట్రానిక్స్ షాపులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆదివారం కావడంతో దుకాణాలన్నీ మూసి ఉన్నాయి. ఆ సమయానికి మెయిన్ రోడ్డు అభివృద్ధి పనులు, వీధి వ్యాపారుల వ్యాపార నిర్వహణ తీరును పరిశీలించేందుకు అటుగా నడుచుకుంటూ వస్తున్న ఎంపీ భరత్ మంటలు ఎగసిపడడాన్ని గమనించారు. వెంటనే ఎంపీ భరత్ అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశారు. జనం కూడా గుమిగూడారు. ఆ వెంటనే షాపు యజమాని భరత్ కుమార్ జైన్ అక్కడకు వచ్చారు. అగ్నిమాపక సిబ్బంది క్షణాల్లో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. భారీ నష్టం జరగకుండా నివారించారు. అయితే ఈ ప్రమాదం ఎలా జరిగిందనేది తెలియదు. కాగా మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకూ ఎంపీ భరత్ అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షించడంపై నగరవాసులు అభినందనలు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- నరేంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



నరేంద్రపురం గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ప్రతి గ్రామంలోను ప్రజా సంక్షేమంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం నరేంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అవినీతి రహితంగా, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శంగా జరుగుతుందన్నారు. బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకువచ్చారన్నారు. కులాలు, మతాలు, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రధానంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం తమదేనని సగర్వంగా చెప్పగలమన్నారు. గతంలో ఏ పథకం ద్వారా ప్రయోజనం పొందాలన్నా జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవలసి వచ్చేదన్నారు.

రూ.7.5 కోట్లతో గ్రామాభివృద్ధి

గడచిన నాలుగేళ్లలో నరేంద్రపురంలో గ్రామాభివృద్ధికి రూ.7.5 కోట్లు వెచ్చించామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఇక్కడ అభివృద్ధి పనులు కేవలం రూ.64 లక్షలు మాత్రమే ఖర్చు చేశారన్నారు. తమ పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ, గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. నీడ లేని 487 మంది పేదలకు నివాస స్థలాలు మంజూరు చేయడమే కాకుండా వాటిలో వారు పక్కా ఇల్లు కట్టుకునేలా తోర్పాటునందించామన్నారు. తిరుమల దేవస్థానం సహకారంతో గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. యువత కోరిక మేరకు త్వరలోనే ఈ గ్రామంలో డిజిటల్ లైబ్రరీని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తంగెళ్ల చిలకమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కోకన్వీనర్ గండి నానిబాబు, నాయకులు అడబాల చినబాబు, పంపన శ్రీను, ప్రగడ రామచంద్రరావు, ప్రగడ శివ, ప్రగడ రాంబాబు, రఘువర్మ, తదితరులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తాళం వేసి ఉన్న కిరాణా దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.20వేలు నగదు, రూ.5వేలు విలువ చేసే సిగరెట్లు చోరీ చేసినట్టు హుకుంపేట ఆదర్శనగర పార్కు ప్రాంతానికి చెందిన కేశట్టి బాలకృష్ణ బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలకృష్ణ ఆదర్శపార్కు ఎదురుగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం షాపు వద్దకు వచ్చే సరికి షట్టర్ సగం తెరిచి ఉండి, తాళాలు పగలుగొట్టి ఉండడంతో బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించింది. షాపులో గుర్తుతెలియని వ్యక్తులు రూ.20వేలు నగదు, రూ.5వేలు విలువ చేసే సిగరెట్లు చోరీ చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాలకృష్ణ పేర్కొన్నారు.

కోరుకొండలో యువకుడి దారుణహత్య



ముప్పిడిశెట్టి శ్రీను (ఫైల్)

మధురపూడి (కోరుకొండ): మండలంలోని పశ్చిమగానుగూడెం రోడ్డులోని ఎస్ఆర్ నగర్‌లో ఉన్న సప్లై కంపెనీ గొడౌన్ వద్ద ఒక యువకుడిని దుండగులు హత్య చేసి పరారయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు కోరుకొండలో వెంకటగిరి లైటింగ్స్ అండ్ డెకరేటర్స్ సప్లయి కంపెనీ యజమాని వెంకన్నకు ముప్పిడి శెట్టి శ్రీను అల్లుడు. అతని స్వగ్రామం గాడాల. సప్లయి కంపెనీ వ్యవహారాలన్నీ శ్రీను చూస్తుంటాడు. ఆదివారం రాత్రి కోరుకొండ పోస్టాఫీసు సెంటర్‌లో కంపెనీ వద్ద పని ముగించుకుని తన గొడౌన్ వద్ద అతడు పని చేస్తుండగా రాత్రి 9 గంటల సమయంలో కొందరు దుండగులు అతడి కళ్లలో కారం చల్లి పొట్టలో కత్తులతో పొడిచి పరారయ్యారు. కత్తిపోట్లకు పొట్టలోని పేగులు బయటకు రావడంతో చికిత్స నిమిత్తం అతడిని స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే శ్రీను మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఎస్సై శారద సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

7న కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠ

రాజానగరం: తూర్పుగానుగూడెంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ కుబేర స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామి ఆలయంలో ఈనెల 7వ తేదీన స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం 7.49 గంటలకు విగ్రహ ప్రతిష్ఠోత్సవం జరగనుంది.

ధోబీ ఘాట్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక గోదావరి గట్టు ధోబీఘాట్ వద్ద ఆదివారం గుర్తు తెలియని సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వ్యక్తి మృతదేహం లభించిందని టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం ఆచూకీ తెలిసిన వారు టూ టౌన్ పోలీసులను సంప్రదించాలని తెలిపారు.